విద్యా - ఉద్యోగ సమాచారం

ఏప్రిల్ నెలాఖరులో 'పది' ఫలితాలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ఏప్రిల్ నెలాఖరులోగా పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన పరీక్షలు ముగిసిన నెల రోజుల్లో ఫలితాలను విడుదల చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం లక్ష్యంగా పెట్టుకున్నది. శనివారంతో ప్రధాన పరీక్షలు ముగియగా, కొన్ని మైనర్ సబ్జెక్టులకు మంగళవారం వరకు జరుగుతాయి. శనివారం సాంఘికశాస్త్రం పరీక్షకు 4,94,068 మంది (99.64శాతం) హాజరు కాగా, 1,747 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మహబూబాబాద్ జిల్లాలో ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి, ముగ్గురు ఇన్విజిలేటర్లను పరీక్షల నుంచి తప్పించారు.

'టెట్‌పై ఉపాధ్యాయులకు స్పష్టతనివ్వండి'

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై ఉపాధ్యాయుల్లో నెలకొన్న అపోహలకు వీలైనంత త్వరగా తెరదించి స్పష్టతను ఇవ్వాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖను కోరాయి. ఈ మేరకు ఆదివారం పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కే లింగయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించాయి. టెట్ పరీక్షపై ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో పలు సందేహాలు ఉన్నాయని, వీటికి వివరణ ఇచ్చి గందరగోళానికి తెరదించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్‌గౌడ్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి, ఆర్‌యూపీపీ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, నాగిరెడ్డి, లింగారెడ్డి, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజీలకు 227 పనిదినాలు

జూన్ 1 నుంచే ఫస్టియర్, సెకండియర్ తరగతులు

2024-25 విద్యా సంవత్సరం క్యాలెండర్ విడుదల

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరం (2024-25)లో ఇంటర్మీడియట్ కాలేజీలకు 227 పనిదినాలను ఇంటర్ బోర్డు ఖరారు చేసింది. ఈ మేరకు అకడమిక్ క్యాలెండర్‌ను బోర్డు కార్యదర్శి శృతి ఓజా శనివారం విడుదల చేశారు. కాలేజీలు జూన్ 1న పున:ప్రారంభం అవుతాయని, అదేరోజు నుంచి ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని బోర్డు పేర్కొన్నది. మొత్తంగా 302 రోజుల్లో 75 సెలవులు ఉన్నాయి. వీటిని మినహాయించి 227 రోజుల పాటు నిర్వహించాలని బోర్డు సూచించింది. విద్యార్థులకు అక్టోబర్ 6 నుంచి 13 వరకు దసరా సెలవులు ఇవ్వగా, 2025 జనవరి 1 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులుగా ప్రకటించింది. 2025 మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే నెలలో నిర్వహిస్తామని బోర్డు తెలిపింది. ఈ అకాడమిక్ క్యాలెండర్‌ను అన్ని కళాశాలలు విధిగా పాటించాలని శృతి ఓజా సూచించారు. పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోర్డు షెడ్యూల్ ప్రకారమే అడ్మిషన్లు తీసుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 31 నుంచి మే 31 వరకు అన్ని కాలేజీలకు వేసవి సెలవులు ప్రకటించామని, ఈ రోజుల్లో కాలేజీలను మూసివేయాలని, ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని పేర్కొన్నారు.

శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా సినీనటి శ్రీలీల

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీ హీరోయిన్ శ్రీలీలను ఎంపిక చేసినట్టు విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 39 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన తమ విద్యాసంస్థ విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన బోధనా పద్ధతులతో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అనితర సాధ్యమైన అనేక అత్యున్నత ర్యాంకులు తమ సంస్థ విద్యార్థులు సాధించారని తెలిపారు. తమ విద్యాసంస్థలు మరిన్ని కొత్త మైలురాళ్లను అధిగమించేందుకు శ్రీలీల సమగ్ర పాత్ర పోషిస్తారన్న విశ్వాసం ఉన్నదని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా తనను ఎంపిక చేయడంపై శ్రీలీల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థలనే ఎంచుకోవాల్సిందిగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు ఆమె సూచించారు.

రేపు జేఈఈ అడ్మిట్‌కార్డుల విడుదల

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): ఐఐటీలు, ఎన్ఐటీలు సహా ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యాసంస్థల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్-2 అడ్మిట్‌కార్డులు సోమవారం విడుదలకానున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వెబ్‌సైట్‌లో పొందుపరిచే ఈ అడ్మిట్‌కార్డులను ఏప్రిల్ 1 నుంచే విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. బీటెక్ పరీక్షలను ఏప్రిల్ 4, 5, 6, 8, 9 తేదీల్లో నిర్వహించనుండగా, జేఈఈ పేపర్-2ఏ (బీఆర్క్), పేపర్-2బీ (బీ ప్లానింగ్) పేపర్లకు 12న పరీక్ష నిర్వహించనున్నారు.

మేలో సీ మ్యాట్ పరీక్ష

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): జాతీయ విద్యాసంస్థల్లోని మేనేజ్‌మెంట్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలు కల్పించేందుకు మే నెలలో నిర్వహించే కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సీ మ్యాట్) షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. అభ్యర్థులు ఏప్రిల్ 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు గడువు ఉండగా, 19న సవరణకు అవకాశం కల్పించారు. మొత్తం 180 ప్రశ్నలకు, 3 గంటలపాటు పరీక్ష జరుగుతుందని ఎన్టీఏ పరీక్షల విభాగం సీనియర్ డైరెక్టర్ డాక్టర్ సాధనా పరాశర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు https://cmat.nta.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముగిసిన డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్స్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌లోని డిఫెన్స్ కాలేజీలో 12 దేశాలకు చెందిన 165 మంది కల్నల్ స్థాయి అధికారులకు 44 వారాలపాటు ఇచ్చిన డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్స్ పూర్తయింది. చివరిరోజైన శనివారం వారికి వాలెడిక్టరీ ఫంక్షన్‌లో భాగంగా ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి వైస్ అడ్మిరల్ డీకే త్రిపాఠి హాజరయ్యారు. కోర్సులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలను ఆవిష్కరించారు.

మెడికల్ కాలేజీల్లో 5,819 ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, మార్చి30 (నమస్తే తెలంగాణ): మెడికల్ కాలేజీల్లో ఖాళీల భర్తీకి ఎన్నికల కమిషన్ అనుమతించింది. దీంతో ఆ దిశగా చర్యలు చేపట్టాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అన్ని మెడికల్ కాలేజీల్లో వెంటనే భర్తీ ప్రక్రియను మొదలు పెట్టాలని డీఎంఈ డాక్టర్ వాణి ప్రిన్సిపాళ్లకు, సూపరింటెండెంట్లకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అన్ని కేడర్లలో కలిపి 5,819 పోస్టుల భర్తీ చేపట్టాల్సి ఉన్నది. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం కలెక్టర్ల ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ ప్రక్రియ చేపట్టాలని సూచించారు.

ఇంజినీరింగ్ డిప్లొమా.. భవితకు ధీమా

పదోతరగతి విద్యార్థులకు సువర్ణావకాశం

- మూడేండ్లు పూర్తికాగానే కొలువుల స్వాగతం
- ఉన్నత చదువులకూ చక్కటి అవకాశాలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): మూడేండ్ల కోర్సు పూర్తికాగానే 20కిపైగా సంస్థల్లో స్వాగతం పలికే కొలువులు. ఉన్నత చదువుల వైపు వెళ్లాలనుకుంటే ఉత్తమమైన కోర్సులు. కోర్సు సమయంలోనే 50 శాతం ప్రాక్టికల్స్. ఇంతటి మేలైన అవకాశాలు ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల సొంతం. పదో తరగతి పరీక్షలు ఫలితాలు రాగానే ఎటువైపు వెళ్లాలన్న.. ఏ కోర్సు తీసుకోవాలన్న సందిగ్ధత విద్యార్థులను పట్టిపీడించడం సహజం. ఇలాంటి వారికి ఈ కోర్సులు చక్కటి అవకాశమని సాంకేతిక విద్యామండలి అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే టీఎస్ పాలిసెట్-24 నోటిఫికేషన్ విడుదల కాగా, ఏప్రిల్ 22 వరకు దరఖాస్తు చేసుకునే వీలున్నది. ఆలస్య రుసుంతో ఏప్రిల్ 26 వరకు గడువు ఉన్నది. పాలిసెట్ పరీక్షను మే 24న నిర్వహిస్తారు. వివరాల కోసం విద్యార్థులు www.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. సందేహాలుంటే 040-23222192, 80352 33929 నంబర్లలో సంప్రదించవచ్చు.

అనుకూలతలు.. అవకాశాలు

ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో జాబ్ గ్యారెంటీ ఉంటుంది. ఈ కోర్సులు పూర్తి చేయడం వల్ల మూడేండ్లలోనే మంచి ఉద్యోగం పొందవచ్చు. జీవితంలో స్థిరపడొచ్చు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలు పూర్తి చేసినవారు అనేక ప్రభుత్వ ఉద్యోగాలకు, జూనియర్ ఇంజినీరింగ్ ఉద్యోగాలకు అర్హులు. ఇంటర్ ఆ తర్వాత నాలుగేండ్ల బీటెక్ చేయడం, ఎంసెట్ పోటీని తట్టుకోవడం కన్నా డిప్లొమా పూర్తిచేసి, ఈసెట్ ద్వారా సులభంగా తక్కువ పోటీతో బీటెక్ సెకండియర్‌లో చేరవచ్చు. పాలిటెక్నిక్‌లో థియరీ, ప్రాక్టికల్స్‌కు 55:50 చొప్పున మార్కులు ఉంటాయి. అదే ఇంజినీరింగ్‌లో ప్రాక్టికల్స్‌కు 20 శాతం మార్కులే మాత్రమే. దీంతో పలు కంపెనీలు పాలిటెక్నిక్‌తో బీటెక్ పూర్తిచేసిన వారిని ఎంచుకుంటున్నాయి.

విస్తృత ఉద్యోగావకాశాలు

మూడేండ్ల డిప్లొమా పూర్తికాగానే ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, రైల్వే, ఎయిర్‌లైన్స్, సింగరేణి, మైనింగ్ కార్పొరేషన్, ఇండియన్ ఆర్మీ, నేవీ, ట్రాన్స్‌పోర్టు, ట్రాన్స్‌కో, జెన్‌కో, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, బెల్, బీఎస్ఎన్ఎల్, డిఫెన్స్, ఎన్టీపీసీ వంటి సంస్థల్లో ఏఈఈ, ఏఈ ఉద్యోగాలు పొందవచ్చు. అనేక ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీల్లోనూ ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఇంజినీరింగ్‌తోపాటు, అగ్రికల్చర్ వర్సిటీల్లోని డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, సీడ్ టెక్నాలజీ-ఆర్గానిక్ అగ్రికల్చర్, వెటర్నరీ డిప్లొమా, హార్టికల్చర్ డిప్లొమా కోర్సులతో జీవితంలో స్థిరపడేలా ఉద్యగాలు దొరుకుతాయి.

> **భవిష్యత్తుకు బంగారు బాటలు**
>
> పదో తరగతి ఫలితాల తర్వాత ప్రతి అడుగు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా, జీవిత గమ్యాన్ని నిర్ణయించేలా ఉండాలి. ఇందుకు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కోర్సులు చక్కటి అవకాశం. ఆసక్తి గల విద్యార్థులంతా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగాలకు దగ్గరి దారిని ఎంచుకోవాలి.
>
> - పుల్లయ్య, కార్యదర్శి, సాంకేతిక విద్యామండలి

భద్రాచలంలో అపచారం

- స్వామిని దర్శించుకుంటూ ఫొటో దిగిన మాజీ ఎంపీ
- సోషల్‌మీడియాలో వైరల్..

భద్రాచలం, మార్చి 30: భద్రాద్రి రామాలయంలో శనివారం అపచారం చోటుచేసుకున్నది. మహబూబాబాద్ మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ భద్రాచలం పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రంగా కిరణ్ తదితరులతో కలిసి ఆయన అంతరాలయం గర్భగుడిలోని సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సమయంలో తీసిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిని చూసిన రామ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గర్భగుడిలో ఉన్న సీతారామ చంద్రస్వామికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసే అధికారం ఎవరికీ లేదని, ప్రభుత్వం నుంచి గాని, దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి గాని అనుమతులు మంజూరు చేసే హక్కు లేదని, కానీ.. ఆలయంలోని మూలవరులతో కూడిన ఫొటోలు పలు వాట్సాప్ గ్రూపులలో కనిపించాయని రామ భక్తులు కోపోద్రిక్తులయ్యారు. ఆలయంలో ఫొటో తీసిన వ్యక్తిని గుర్తించి.. అతనిపై కేసు నమోదు చేయాలని రామ భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. మాజీ ఎంపీ, బీజేపీ ప్రస్తుత ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌తోపాటు పలువురు సీతారామచంద్రస్వామివారి దర్శనానికి వచ్చి ఫొటోలు తీసినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆలయంలోని మూలవరులను ఫొటోలు తీసిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి వివరించారు.

భారత్‌కు పాకిస్థానీల 'జిందాబాద్'

హైజాక్‌కు గురైన నౌక, సిబ్బందిని కాపాడిన నేవీ

న్యూఢిల్లీ, మార్చి 30: భారత నేవీ మరోసారి సముద్రపు దొంగల ఆట కట్టించింది. అరేబియా సముద్రంలో హైజాక్‌కు గురైన 'ఎఫ్‌వీ ఏఐ కంబర్ 786' అనే ఇరాన్ ఫిషింగ్ నౌక, అందులోని 23 మంది పాకిస్థానీ సిబ్బందిని శుక్రవారం సురక్షితంగా కాపాడింది. ఈ ఆపరేషన్ కోసం ఐఎన్ఎస్ సుమేధ, ఐఎన్ఎస్ త్రిశూల్‌లను మోహరించింది. తమను కాపాడినందుకు నౌకలోని పాకిస్థాన్ దేశస్తులు భారత నేవీకి ధన్యవాదాలు చెబుతూ 'ఇండియా జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఈ వీడియోను నావికా దళం షేర్ చేసింది. నౌక హైజాక్ ఘటనకు సంబంధించి భారత నేవీ తొమ్మిది మంది సాయుధ సముద్రపు దొంగలను అదుపులోకి తీసుకొన్నది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనేందుకు దేశానికి తీసుకురానున్నట్టు ఓ ప్రకటనలో వెల్లడించింది.

లోదుస్తుల కలర్ ఏంటి?

- అందంగా ఉన్నావ్.. ముద్దు ఇవ్వు
- ఖమ్మం జిల్లా మడుపల్లిలో విద్యార్థినులపై హెచ్‌ఎం కీచకపర్వం
- తల్లిదండ్రులు నిలదీసినా కప్పిపుచ్చుకునే ప్రయత్నం
- హెచ్‌ఎంను కాపాడేందుకు రంగంలోకి అధికార పార్టీ నేతలు
- పోలీసుల ద్వారా తల్లిదండ్రులను బుజ్జగించే కార్యక్రమం
- ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని, డబ్బు లిస్తామని ప్రలోభం

మధిర రూరల్, మార్చి 30: విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులకు బంగారు బాటలు వేయాల్సిన ఓ హెడ్‌మాస్టర్.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి కీచకపర్వానికి తెరలేపాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా మధిర మండలం మడుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. మధిర మున్సిపాలిటీ మడుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్‌మాస్టర్.. పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థినులపై కన్నేశాడు. కొన్ని రోజులుగా వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. విద్యార్థినుల బుగ్గలు నిమరడం, లోదుస్తుల కలర్ ఏంటని అడగడం, అందంగా తయారయ్యావంటూ కితాబులివ్వడం, ముద్దులు పెట్టాలంటూ కోరడం వంటి చేష్టలతో తన కీచకపర్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఈ విషయాలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థినులు కొన్ని రోజులపాటు తమలో తామే కుమిలిపోయారు. ఆ తరువాత ఇతర టీచర్లకు చెప్పగా.. హెడ్‌మాస్టర్ చాలా మంచి వాడంటూ వారు కితాబిచ్చారు. సదరు టీచర్లు ఈ విషయాన్ని మళ్లీ హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యార్థినులపై కక్ష పెంచుకున్న హెచ్‌ఎం.. వారిపై వేధింపులను తీవ్రం చేశాడు. మరెవరికైనా చెబితే టీసీ ఇస్తానని, భవిష్యత్ లేకుండా చేస్తానని బెదిరించాడు. విద్యార్థినులు ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్పారు. ఆగ్రహించిన వారు స్కూల్‌కెళ్లి హెచ్‌ఎంను నిలదీశారు. తన తప్పేమీ లేదని తొలుత బుకాయించిన హెచ్‌ఎం.. ఆ తర్వాత తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ బెదిరింపులకు దిగాడు. ఈ మేరకు తల్లిదండ్రులు మధిర పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసుల ద్వారా బుజ్జగింపులు

ఓ పార్టీ నాయకుడి పలుకుబడితో సదరు హెచ్‌ఎం పోలీసులపై ఒత్తిడితెచ్చాడు. విద్యార్థినుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా.. హెచ్‌ఎంపై కేసు నమోదు చేయలేదు. ఏకంగా పోలీసులతోనే విద్యార్థినులను బుజ్జగించే ప్రయత్నం చేశాడు. ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని సూచించారు. కావాలంటే ఆర్థిక అవసరాల కోసం డబ్బులిస్తానని సదరు హెచ్‌ఎం చెప్తున్నాడని తెలిపారు. అందుకు తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారని, కేసు నమోదు చేయకతప్పదని పోలీసులు అన్నట్టు తెలిసింది.

బీఆర్ఎస్ నాయకుడిపై హత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి...

అనుమతులతో నేను మట్టి వ్యాపారం చేస్తున్నా.. కావాలని చాలా సార్లు నాపై తప్పుడు ఫిర్యాదు చేశాడు. నా అంతు చూస్తానని బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లేందుకు నేను మరో నలుగురితో కలిసి రోడ్డు వద్దకు వచ్చాను. నన్ను చూసిన అశోక్ దుర్భాషలాడుతూ ఇంట్లో నుంచి కత్తిని తీసుకొచ్చి నాపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. రజినీకాంత్, విఘ్నేష్, రాంబాబులు అడ్డుకొని నన్ను కాపాడే ప్రయత్నం చేశారు. అతని చేతిలో ఉన్న వేట కత్తిని తీసుకొని పారేశారు. ఇంతలో ఫంక్షన్‌లో ఉన్న నా భార్య వసంత బయటకు రాగా.. అశోక్ ఇంటికి వెళ్లి మరో కత్తిని తీసుకొచ్చి నాపై వేటేసేందుకు యత్నించాడు. వసంత అడ్డుకుంటుండగా ఆమె మోచేయిపై కత్తివేటు పడింది. అడ్డుకోబోయిన రాంబాబుకు సైతం గాయాలయ్యాయి. ప్రాణ రక్షణ నిమిత్తం ములుగు పోలీస్ స్టేషన్‌లో అశోక్‌పై ఫిర్యాదు చేశాను' అని బాధితుడు మామిడి అశోక్ వివరించాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌కు వచ్చాయని, విచారణ చేసి కేసు నమోదు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడి దాడిలో గాయపడి ములుగు ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. నాగజ్యోతి మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళ వసంతపై కత్తితో దాడి చేసి గాయపర్చిన కాంగ్రెస్ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఎస్పీతోపాటు డీఎస్పీకి ఫోన్‌లో విషయాన్ని తెలియజేశారు.



గద్వాలలో కాంగ్రెస్ బూత్‌లెవల్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్‌ను తోసేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అనుచరులు

మైక్ అడిగితే తోసేశారు!

- కాంగ్రెస్ జాతీయ నేతల సాక్షిగా దళితుడికి అవమానం
- మాజీ జెడ్పీ చైర్మన్‌ను స్టేజీ పైనుంచి నెట్టేసిన ఓ వర్గం నేతలు

గద్వాల, మార్చి 30: 'అందరికీ మాట్లాడటానికి మైక్ ఇస్తున్నారు.. నాకు ఎందుకు ఇవ్వడం లేదు' అని ప్రశ్నించిన దళితుడైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్‌కు చుక్కెదురైంది. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అనుచరులు అతడిని వేదిక పైనుంచి తోసేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం గద్వాల, అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ లెవల్ స్థాయి కన్వీనర్ల సమావేశాన్ని గద్వాల, అలంపూర్ ఇన్‌చార్జీలు సరిత, సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, ఏఐసీసీ నేత రోహిత్ చౌదరి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎంపీ మందా జగన్నాథం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలపై బూత్‌లెవల్ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. సమావేశం చివరికి వచ్చినా తనకు మాట్లాడటానికి మైక్ ఇవ్వడం లేదని మాజీ జడ్పీచైర్మన్ బండారి భాస్కర్ నిలదీశారు. ఆగ్రహంతో దురుసుగా మాట్లాడటంతో అక్కడే ఉన్న సంపత్ అనుచరులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేజీపై నుంచి తోసుకుంటూ వెళ్లారు. ఒక దశలో దాడి చేసే ప్రయత్నం చేశారు. ఈ హఠాత్పరిణామాన్ని అందరూ చూస్తూ ఉండిపోయారే తప్పా ఎవరూ ఏమీ చేయలేకపోయారు. కార్యకర్తలు సమన్వయం పాటించాలని మంత్రి జూపల్లి మైక్‌లో చెప్పినా వినిపించుకోలేదు. అక్కడున్న ప్రజాప్రతినిధులు కార్యకర్తలను శాంతింపజేశారు.

ఏసీబీకి చిక్కిన మీర్‌పేట ఎస్సై

బడంగ్‌పేట, మార్చి 30: సివిల్ వ్యవహారాల్లో తలదూర్చడంతోపాటు లంచావతారమెత్తిన మీర్‌పేట ఎస్ఐ బొడ్డుపల్లి సైదులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కాడు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో 200 గజాల ప్లాట్‌కు సంబంధించిన వివాదాన్ని సెటిల్ చేసేందుకు సుభాష్ అనే వ్యక్తి నుంచి రూ.20 వేల లంచాన్ని డిమాండ్ చేసిన సైదులును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన నుంచి రూ.10 వేలు రికవరీ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నదని, కాబట్టి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

చోరీకి వచ్చి.. గ్రామస్థుల చేతిలో హతం

నవీపేట, మార్చి 30: మూతబడిన రైస్‌మిల్లులో చోరీకి వచ్చిన ఓ నిందితుడు గ్రామస్థుల దాడి చేయడంతో ప్రాణాలు వదిలాడు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం పొల్దాలో శనివారం ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పొల్దా గ్రామ శివారులో ఉన్న శ్రీవేంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ కొన్ని నెలల క్రితం మూతబడింది. శనివారం మధ్యాహ్నం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి తండాకు చెందిన ఆరుగురు ఆటోలో రైస్‌మిల్ వద్దకు వచ్చారు. వారిని పట్టుకునేందుకు యత్నించగా ఐదుగురు ఆటోలో పరారయ్యారు. మరో నిందితుడు బానోత్ సునీల్ (44) రైస్‌మిల్ గోడ దూకి పొలాల వైపు పారిపోయాడు. అతడ్ని వెంబడించి పట్టుకున్న గ్రామస్థులు కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని నిజామాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సిరిసిల్ల చేనేత బకాయిలు విడుదల చేయాలి

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల చేనేత కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.270 కోట్ల బతుకమ్మ చీరల బకాయిలను, చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.9 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేతన్నలతో రాజకీయాలు మానాలని, సిరిసిల్లలో నేత కార్మికుల దుర్భర పరిస్థితులను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు.

సాయం కోరితే చంపేశారు!

- స్నేహితుడే ప్రాణం తీశాడు
- హైదరాబాద్ నుంచి వచ్చి హత్య
- వరంగల్ డీసీపీ రవీందర్ వెల్లడి

నర్సంపేట, మార్చి 30: చిన్ననాటి స్నేహితుడని సాయం కోరిన ఓ మహిళ.. అతడి చేతిలోనే హత్యకు గురైంది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లిలో జరిగిన ఈ హత్య ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు కేసు మిస్టరీని ఛేదించగా.. వరంగల్ డీసీపీ రవీందర్ శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మైసంపల్లికి చెందిన వెంగళ సుప్రియ (27)కు భర్త రాజ్‌కిరణ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజ్‌కిరణ్ హనుమకొండలో ఓ ఎలక్ట్రానిక్ షాపులో పనిచేస్తున్నాడు. సుప్రియ ములుగులో చదువుతున్నప్పుడు శశికాంత్‌తో పరిచయమేర్పడి స్నేహితుడయ్యాడు. ప్రస్తుతం సుప్రియ అనారోగ్యానికి గురైంది. మెరుగైన చికిత్స చేయించుకునేందుకు దవాఖానల సమాచారం కోసం హైదరాబాద్‌లో ఉన్న శశికాంత్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగింది. ప్రస్తుతం శశికాంత్ స్విగ్గీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ములుగు జిల్లా జగ్గన్నపేట పరిధి సారంపల్లికి చెందిన అజ్మీరా శిరీషతో సహజీవనం చేస్తున్నాడు. సుప్రియ ఫోన్ చేసిన విషయాన్ని శశికాంత్ శిరీషకు చెప్పాడు. కోపోద్రిక్తురాలైన శిరీష శశికాంత్‌ను తీసుకొని హైదరాబాద్ నుంచి బైక్‌పై మైసంపల్లికి వచ్చింది. తాను శశికాంత్‌తో సహజీవనం చేస్తున్నానని, ఆయనకు మరోసారి ఫోన్ చేయొద్దని సుప్రియకు వార్నింగ్ ఇచ్చి వెళ్లిపోయింది. అదే సమయంలో సుప్రియ మెడలో ఉన్న బంగారంపై శిరీష కన్నుపడింది. దాన్ని కాజేసేందుకు సుప్రియను హత్య చేయాలని శశికాంత్, శిరీష పథకం పన్నారు. ప్లాన్‌లో భాగంగా.. వారు మరోసారి మైసంపల్లికి వచ్చారు. అప్పుడు సుప్రియ ఇంట్లో లేకపోవడంతో వెళ్లిపోయారు. తిరిగి ఈ నెల 23న మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో సుప్రియ వద్దకు వచ్చారు. వంట గదిలో ఉన్న సుప్రియను వెనుక నుంచి శిరీష గట్టిగా పట్టుకోగా.. శశికాంత్ గొంతు నులిమి చంపేశాడు. చనిపోయాక ఆమెను మంచంపై పడుకోబెట్టి.. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని బైక్‌పై హైదరాబాద్‌కు పరారయ్యారు. మిగిలిన వస్తువులను అమ్ముకోవడానికి ఖానాపురం మండలంలో తెలిసిన వారి ఇంటికి వస్తుండగా పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకొని విచారణ చేస్తే నేరం ఒప్పుకున్నారు. దీంతో శశికాంత్, శిరీషను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలు, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీసీపీ వెల్లడించారు.

కార్ల తయారీ రంగంలో హీరోలపై సినిమాలే లేవు!

- ఎలన్ మస్క్, ఆనంద్ మహీంద్రా ఆసక్తికర ట్వీట్లు
- షాప్ ఫ్లోర్ మీద ప్లాంట్ ప్రారంభించానన్న మహీంద్రా

న్యూఢిల్లీ: కార్ల గురించి లక్షలాది సినిమాలు ఉన్నాయని, అయితే వాటి తయారీ గురించి వివరంగా తెలిపే సినిమాలు లేవని డోగ్‌డిజైనర్ తన ట్వీట్‌లో ఆరోపించారు. హై వాల్యూమ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎంత కష్టమో ప్రపంచానికి తెలియజేయడానికి ఎవరో ఒకరు ఓ సినిమాను తీయాలన్నారు. దీనిపై ఎలన్ మస్క్ స్పందిస్తూ ఇచ్చిన ట్వీట్‌లో, ఓ గ్యారేజిలో 'యురేకా' అంటూ ఒంటరి ఇన్వెంటర్ ఏ విధంగా పనిచేస్తున్నారో వివరించే సినిమాలు చాలా ఉన్నాయని, కానీ మాన్యుఫ్యాక్చరింగ్ గురించి తెలిపే సినిమాలు లేకపోవడంతో ప్రజలు దీని గురించి తెలుసుకోలేకపోతున్నారని అన్నారు. హైవాల్యూమ్, పాజిటివ్ మార్జిన్ ప్రొడక్షన్‌కు చేరుకోవడానికి అవసరమైన శ్రమతో పోల్చితే, ప్రోటోటైప్స్ నల్లేరు మీద బండి నడక వంటివని అన్నారు. మస్క్ ట్వీట్‌పై ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ, 'ఎలన్ మస్క్‌తో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నా. నేను నా కెరీర్‌ను ఓ ఆటోప్లాంట్ షాప్ ఫ్లోర్ మీద ప్రారంభించాను. హై వాల్యూమ్ ప్రొడక్ట్స్‌ను తయారు చేయడానికి నేను చేసే అవిశ్రాంత కృషి, నాన్ స్టాప్ ప్రాబ్లమ్ సాల్వింగ్ వల్ల లభించే అనుభూతిని నిరంతరాయంగా ఆస్వాదిస్తూనే ఉన్నాను. మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలోని హీరోల గురించి సినిమాలు తీయాలి, దీనికి వారు అర్హులు. కార్ల తయారీ గురించి తీసే ఫిల్మ్స్‌కు యూట్యూబ్‌లో భారీ వ్యూవర్‌షిప్ ఉంటున్నది. కాబట్టి మరిన్ని సినిమాల కోసం ఎదురు చూసే ప్రేక్షకులు కచ్చితంగా ఉన్నారు' అని బదులిచ్చారు.

కానిస్టేబుల్ అభ్యర్థులపై సర్కారు నిర్దయ

- కేసుల్లో నిర్దోషిగా తేలితే ఉద్యోగాలు ఎందుకివ్వరు?
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని వైనం
- మనోవేదనకు గురవుతున్న అభ్యర్థుల కుటుంబాలు
- వారిని వెంటనే శిక్షణకు పంపాలి: బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 30(నమస్తే తెలంగాణ): కేసులు సాకుగా చూపుతూ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనా శిక్షణకు పంపకుండా ప్రభుత్వం కొందరు అభ్యర్థుల పట్ల నిర్దయ చూపుతున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ప్రభుత్వ అలసత్వంతో సుమారు 1,500 మంది అభ్యర్థులు తీరని అన్యాయానికి గురవుతూ మనోవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వారి కన్నీళ్లు తుడిచే నాథుడే లేడని శనివారం ఆయన ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. అభ్యర్థులు తమ స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ అటెస్టేషన్) పత్రంలో వివిధ కేసులు ఉన్నట్టు ధ్రువీకరించారని తెలిపారు. విద్యార్థి దశలో ఉద్యమ కేసులు, కుటుంబ తగాదాలతో కక్షపూరితంగా, ఉద్దేశపూర్వకంగా నమోదైన కేసులే అత్యధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. చాలా కేసుల్లో ఇప్పటికే కొందరు అభ్యర్థులు కోర్టుల్లో నిర్దోషులుగా తేలారని తెలిపారు. స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) అధికారుల తుది పరిశీలనలో కూడా అభ్యర్థులు ఆయా కేసుల పూర్తి వివరాలతో పాటు, కేసుల్లో నిర్దోషిగా తేలిన కోర్టు తీర్పు కాపీలను స్వయంగా స్పెషల్ బ్రాంచి అధికారులకు అందించారని తెలిపారు. అయినా ప్రభుత్వం వీరికి శిక్షణ అవకాశం కల్పించడం లేదని, నిరుద్యోగులపై ఇంత చులకనభావం ఎందుకని ప్రశ్నించారు. కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులు శిక్షణ ఆర్డర్ కాపీలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నివాసం, డీజీపీ కార్యాలయం చుట్టూ గత రెండు నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, దీంతో అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వీరి మనోవేదనపై ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి ఎస్బీ పరిశీలనలో నిర్దోషులుగా తేలిన కానిస్టేబుల్ అభ్యర్థులను శిక్షణకు పంపేలా చైర్మన్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తన ట్వీట్‌ను సీఎం కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు తెలంగాణ డీజీపీకి చేరేలా ట్యాగ్ చేశారు.